RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

www.nityamnigha.com

NITYAM NIGHA TELUGU DAILY


మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts

వరంగల్ | సంపుటి 2 | సంచిక 106 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | ఆదివారం | 18.10.2026 | పేజీలు : 8





బిస్కెట్ల తయారీలో పశువుల దాణా..

తయారీ సంస్థపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కఠిన చర్యలు!

- ప్రియగోల్డ్ బిస్కెట్లలో పశువుల దాణా వాడినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆరోపణ
- తయారీ సంస్థ సూర్య ఫుడ్ అండ్ ఆగ్రోపై ప్రాసిక్యూషన్‌కు ఆదేశం
- పరిశుభ్రతా లోపాలు, ఇతర ఉల్లంఘనలు గుర్తింపు
- ఇప్పటికే కంపెనీ ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌ను రద్దు చేసిన అధికారులు

తెలంగాణకునేటి నుంచి వర్ష సూచన..

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

- ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక
- ఉత్తర తమిళనాడు తీరంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- హైదరాబాద్ సహా అనేక జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ



2

దసరా రద్దీ: విజయవాడ హైవేపై

కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్

- దసరా పండుగ నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీ రద్దీ
- యాదాద్రి జిల్లా పంతంగి టోల్‌ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- చౌటుప్పల్‌లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా ట్రాఫిక్‌కు అదనపు అడ్డంకి



2

హైదరాబాద్‌లో ఈడీ

మెరుపుదాడులు

- ఆన్‌లైన్ గేమింగ్ ముఠా గుట్టురట్టు

- హైదరాబాద్ సహా ఐదు నగరాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలపై ఈడీ దాడులు
- అక్టోబర్ 13న 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన అధికారులు
- దుబాయ్ కేంద్రంగా బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు సాగుతున్నట్లు గుర్తింపు



నిత్యం నిఘా, హైదరాబాద్ : ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్, సైబర్ ఫ్రాడ్ సిండికేట్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి ఉక్కుపాదం మోపింది. హైదరాబాద్, ముంబై, పుణే, మెహసానా, సూరత్ నగరాల్లోని 20 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ సోదాల్లో మనీలాండరింగ్‌కు సంబంధించిన కీలక సమాచారాన్ని గుర్తించినట్లు ఈడీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 13న నిర్వహించిన ఈ తనిఖీల్లో కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఇతర సాక్ష్యాధారాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ వెల్లడించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA) కింద, ఈ కేసుతో సంబంధం ఉన్న పలు సంస్థలు, వ్యక్తుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసినట్లు పేర్కొంది.....

2

తెలంగాణ నీళ్లను

తరలించే కుట్ర..

- తెలంగాణలో కరవు పరిస్థితులకు ప్రభుత్వమే కారణమని ఆరోపణ
- దేవాదులలో 10 మోటార్లకు మూడు మాత్రమే నడుస్తున్నాయని విమర్శ
- గోదావరి జలాల తరలింపునకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆరోపణ
- గోదావరి-కావేరి అనుసంధాన ప్రతిపాదనపై హరీశ్‌రావు అభ్యంతరం



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని మండిపడ్డారు. అత్యంత కీలకమైన సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ మూడు మాత్రమే నడిపిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు.

2

బతుకమ్మను భావితరాలకు అందిద్దాం - కేటీఆర్

- బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఈ వేడుకలు ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక
- సామూహిక వారసత్వానికి నిదర్శనం
- నాటి ఉద్యమంలో ఐక్యతను చాటిన వేడుకలు
- ఆడపడుచులందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు



నిత్యం నిఘా, హైదరాబాద్: తరతరాలుగా కొనసాగుతున్న అపురూపమైన బతుకమ్మ వేడుకల సంప్రదాయాన్ని కాపాడుకుంటూ భావితరాలకు అందించడం ప్రతి ఒకరి బాధ్యత అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. తెలంగాణ సంస్కృతికి, ప్రకృతి ఆరాధనకు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి సద్దుల బతుకమ్మ ప్రతీక అని తెలిపారు. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, తెలంగాణ ఆడపడుచులందరికీ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.....

2

ఢిల్లీ నిరసనల వెనుక పెద్ద స్కెచ్

- బీజేపీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి

- ఢిల్లీ ఓటర్ల జాబితా నిరసనలపై బీజేపీ ఎంపీ కొండా సంచలన వ్యాఖ్యలు
- భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు ఎన్‌క్లేవ్‌ల సమస్యతో వివాదాన్ని ముడిపెట్టిన వైనం
- ప్రధాని మోదీకి వ్యతిరేకంగా 'రెజీమ్ ఛేంజ్' కుట్ర జరుగుతోందని ఆరోపణ



2

ఎల్ నినో ఎఫెక్ట్: కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి



ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన

విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి

రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్

2

దాండియా సంబరాల్లో అపశృతి

- విద్యార్థిని దుర్మరణం..
- ఐదుగురి పరిస్థితి విషమం



ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ దాండియా వేడుకల్లో భారీ ప్రమాదం

లైటింగ్ స్టాండ్ విద్యార్థులపై కూలడంతో వనపర్తికి చెందిన సోనీ అనే విద్యార్థిని మృతి

సుమారు 25 మంది విద్యార్థులకు గాయాలు..

ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం

2

తెలంగాణలో తీవ్ర కరవు, 315 మండలాల్లో కరవు ఛాయలు : తుమ్మల నాగేశ్వరరావు

- రాష్ట్రంలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నట్లు గుర్తింపు
- కేంద్రం తక్షణమే సాయం చేయాలని కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రాష్ట్రవ్యాప్తంగా 23 శాతం వర్షపాత లోటు, 13 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు



నిత్యం నిఘా, హైదరాబాద్: తెలంగాణలో కరవు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గడంతో 315 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని తక్షణమే ఆదుకోవాలని, సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్), మధ్యంతర పంట విత్తనాల పంపిణీకి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభాన్ని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మద్దతు ధరతో మొక్కజొన్న, జొన్న తదితర పంటలను 100 శాతం కొనుగోలు చేయాలని, ధరల మద్దతు పథకం కింద ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. రసాయన ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించడంతో పాటు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పనలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన అనధికారిక క్యాబినెట్ సమావేశంలోనూ సుదీర్ఘంగా చర్చ జరిగింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని, వాటిలో 101 మండలాల్లో తీవ్ర కరవు, 214 మండలాల్లో ఓ మోస్తరు కరవు నెలకొందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు రూ. 1,986.89 కోట్లతో కూడిన సహాయ ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

హైదరాబాద్‌లో ఈడీ మెరుపుదాడులు

- ఆన్‌లైన్ గేమింగ్ ముఠా గుట్టురట్టు

మొదటిపేజీ తరువాయి.. "ఆల్ ప్యానెల్ ఎక్స్ఛేంజ్", "MGM91" అనే ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రజల నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకుని మోసం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో భాగంగా గతంలో పుణె, ముంబై, బెంగళూరు నగరాల్లో సోదాలు జరిపిన అధికారులు, ఎడ్జమ్ ఫిన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు రామ్ యూ రాంధానిని అరెస్టు చేశారు. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు.బాధితుల నుంచి సేకరించిన నిధులను రాంధానికి చెందిన పుణె సంస్థ బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించినట్లు దర్యాప్తులో తేలింది. రాంధాని సంస్థ "ఐపైసా" (iPaisa) అనే ప్రత్యేక పేమెంట్ ప్లాట్‌ఫామ్‌ను సృష్టించి, దాని ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ ఆపరేటర్ల కోసం 200కు పైగా షెల్ కంపెనీలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా లావాదేవీలు నడిపినట్లు ఈడీ గుర్తించింది. ఈ బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు దుబాయ్ కేంద్రంగా సాగుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ అక్రమ లావాదేవీలకు, నిధుల మళ్లింపునకు కొన్ని సహకార బ్యాంకులు కూడా సహకరించినట్లు ఈడీ అనుమానిస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా సంపాదించిన డబ్బును మూడు మార్గాల్లో దేశం దాటించినట్లు గుర్తించారు. వాణిజ్య లావాదేవీల ముసుగులో ఓవర్ ఇన్వాయిసింగ్ ద్వారా, ఏపీఎంసీ యూనిట్ల పేరుతో తెరిచిన మ్యూల్ ఖాతాల నుంచి నగదు విత్‌డ్రా చేయడం ద్వారా, చివరిగా క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చి విదేశాలకు తరలించినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది.

తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర..

మొదటిపేజీ తరువాయి.. తాము అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ కరవు పరిస్థితులు, పంటల సాగుకు విరామం ప్రకటించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో తెలంగాణ నీటిని తరలించే ప్రతిపాదనలకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. గతంలో గోదావరి-బనకచర్ల, గోదావరి-నల్లమలసాగర్ ప్రతిపాదనలు ముందుకు సాగలేదని, ఇప్పుడు గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ నేతలు ఇలాంటి ప్రతిపాదనలు చేయలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే ఏపీ పాలకులు కొత్త ప్రతిపాదనలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.

తెలంగాణకు నేటి నుంచి వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. రేపు (అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

దసరా రద్దీ: విజయవాడ హైవేపై కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్

మొదటిపేజీ తరువాయి.. దసరా పండుగ పురస్కరించుకుని హైదరాబాద్ నగర వాసులు భారీ సంఖ్యలో సొంతూళ్లకు పయనమవడంతో జాతీయ రహదారులపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం ఉదయం నుంచి వాహనాలు పోటెత్తాయి. ఫలితంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. పండుగ సెలవుల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుంచే ప్రయాణాలు ప్రారంభం కాగా, శనివారం ఉదయానికి రద్దీ మరింత తీవ్రమైంది. విజయవాడ వైపు వెళ్లే వాహనాలతో టోల్‌ప్లాజా పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. సాధారణ రోజుల్లో కొద్ది నిమిషాల్లోనే దాటాల్సిన టోల్‌గేట్‌ను దాటేందుకు గంటల సమయం పడుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు, ఇదే మార్గంలోని చౌటుప్పల్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కొనసాగుతుండటం ట్రాఫిక్‌కు అదనపు ఆటంకంగా మారింది. నిర్మాణ పనుల కారణంగా వాహనాలన్నీ సర్వీస్ రోడ్డు మీదుగా నెమ్మదిగా వెళ్లాల్సి రావడంతో, ఇది వాహనాలు నిలిచిపోవడానికి మరో ప్రధాన కారణంగా నిలుస్తోంది.పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు రంగంలోకి దిగి, టోల్‌ప్లాజా వద్ద రద్దీని తగ్గించేందుకు అదనపు సిబ్బందిని మోహరించారు. ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేసే క్రమంలో కొన్ని వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లిస్తున్నారు. అయినప్పటికీ, వాహనాల తాకిడి అధికంగా ఉండటంతో రాకపోకలు నెమ్మదిగానే సాగుతున్నాయి. పండుగ ప్రయాణాలు పూర్తయ్యే వరకూ ఈ రద్దీ కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎల్ నినో ఎఫెక్ట్: కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి.. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

బిస్కెట్ల తయారీలో పశువుల దాణా.. తయారీ సంస్థపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కఠిన చర్యలు..!

మొదటిపేజీ తరువాయి.. దేశవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందిన 'ప్రియగోల్డ్' బిస్కెట్ల తయారీలో పశువుల దాణా వినియోగిస్తున్నట్లు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సంచలన ప్రకటన చేసింది. ఈ తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినందుకుగాను, ప్రియగోల్డ్ తయారీ సంస్థ అయిన 'సూర్య ఫుడ్ అండ్ ఆగ్రో లిమిటెడ్'పై ప్రాసిక్యూషన్ ప్రారంభించేందుకు అనుమతి మంజూరు చేసినట్లు శనివారం వెల్లడించింది. ఒక వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు సూర్య ఫుడ్ అండ్ ఆగ్రో కంపెనీ తయారీ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో, 'పశువుల దాణాకు మాత్రమే ఉద్దేశించినది' అని స్పష్టంగా రాసి ఉన్న తవుడు బస్తాలను అధికారులు కనుగొన్నారు. మనుషుల వినియోగానికి ఏమాత్రం పనికిరాని ఈ తవుడును, బిస్కెట్లలో ఫైబర్ (పీచు పదార్థం) కోసం ముడిసరుకుగా వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆరోపణలతో పాటు, సదరు పరిశ్రమలో మరిన్ని లోపాలు ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తమ ప్రకటనలో పేర్కొంది. పరిశ్రమ ప్రాంగణంలో అపరిశుభ్రత, పురుగుల నివారణ చర్యలు చేపట్టకపోవడం, ముడిసరుకుల నిల్వలో నిర్లక్ష్యం, సిబ్బంది వ్యక్తిగత శుభ్రత పాటించక పోవడం వంటి అనేక ఉల్లంఘనలను గుర్తించినట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో, కంపెనీ ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌ను ఇప్పటికే సస్పెండ్ చేశామని, తాజాగా క్రిమినల్ చర్యల్లో భాగంగా ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చామని వివరించింది. సాధారణంగా ధాన్యాల పైపొర అయిన తవుడును ఆహారంలో ఫైబర్ కోసం వాడుతుంటారు. అయితే, మనుషుల కోసం వాడే 'ఫుడ్-గ్రేడ్' ముడిపదార్థాలకు, పశువుల దాణాకు నాణ్యత, భద్రతా ప్రమాణాల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. పశువుల దాణాగా నిర్దేశించిన పదార్థాలను మనుషుల ఆహారంలో కలపడం చట్టరీత్యా తీవ్రమైన నేరం. ఈ చర్యలు కేవలం ప్రియగోల్డ్ సంస్థకే పరిమితం కాలేదు. ఫుల్ క్రీమ్ మిల్క్ శాంపిల్‌లో డిటర్జెంట్ అవశేషాలు గుర్తించినందుకు 'దొడ్ల డెయిరీ'పై, ఎండు ద్రాక్షలో పురుగుమందులు అవశేషాలు ఉన్నందుకు యూఈఐఆర్ ఆర్గానిక్ ఫుడ్స్‌పై కూడా ప్రాసిక్యూషన్ చర్యలు ప్రారంభించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. అయితే, ఏయే ప్రియగోల్డ్ బిస్కెట్ వేరియంట్లలో ఈ ఉల్లంఘనలు జరిగాయి, ఏ బ్యాచ్‌లకు ఇది వర్తిస్తుంది అనే వివరాలను ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడించలేదు. అలాగే, దేశవ్యాప్తంగా ఆ బిస్కెట్లను వెనక్కి తీసుకోవాలని (రీకాల్) కూడా ఇప్పటి వరకు ఆదేశాలు జారీ చేయలేదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ తాజా ఆరోపణలపై సూర్య ఫుడ్ అండ్ ఆగ్రో సంస్థ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

బతుకమ్మను భావితరాలకు అందిద్దాం - కేటీఆర్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో బతుకమ్మ పండుగ మన సాంస్కృతిక అస్తిత్వాన్ని, తెలంగాణ ప్రజల ఐక్యతను ప్రపంచానికి చాటిచెప్పిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం బతుకమ్మ పండుగకు రాష్ట్ర పండుగగా అధికారిక గుర్తింపునిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహించేలా బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని పేర్కొన్నారు. 2017 నుంచి బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి, ఆడబిడ్డలకు పండుగ కానుక అందించిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు పండుగ కానుక అందించడంతోపాటు, తెలంగాణ నేతన్నల ఉపాధి కల్పించేందుకు కృషి జరిగిందని తెలిపారు.సంఘానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని చేరవేశారని శేషన్ ఆరోపించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆయనను తొలగించకుండా కాపాడటమే కాకుండా, తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించిందని రాజ్‌నాథ్ విమర్శించారు.

దాండియా సంబరాల్లో అపశృతి

: విద్యార్థిని దుర్మరణం.. ఐదుగురి పరిస్థితి విషమం

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్‌లోని నాదర్‌గుల్ ప్రాంతంలో ఉన్న ఎంవీఎస్ఆర్ (MVSR) ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాలేజీలో నిర్వహిస్తున్న 'సంగమం-2026' టెక్నికల్ మరియు కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన దాండియా వేడుకల్లో విషాదం నిండింది. వేడుకల కోసం ఏర్పాటు చేసిన భారీ ఇనుప విద్యుత్ దీపాల స్టాండ్ (Lighting Truss) ఒక్కసారిగా విద్యార్థులపై కుప్పకూలింది. ఈ ప్రమాదంలో వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఆమెతో పాటు మరో 25 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో మృతురాలి సోదరితో సహా ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది బాధితులను ఎల్‌బీ నగర్‌లోని కామినేని ఆసుపత్రికి, అలాగే అదభట్లలోని ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. భారీ ఈదురుగాలుల కారణంగానే లైటింగ్ క్రేన్ అదుపుతప్పి కూలిపోయినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. స్టాండ్ కూలిన సమయంలో మంటలు కూడా చెలరేగడంతో విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

ఢిల్లీ నిరసనల వెనుక పెద్ద స్కెచ్ : బీజేపీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. ఢిల్లీలో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు (SIR) వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల వెనుక భారీ కుట్ర దాగి ఉందని తెలంగాణ బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఒకప్పుడు భారత్-బంగ్లాదేశ్ మధ్య దశాబ్దాలుగా నలిగిన సరిహద్దు ఎన్‌క్లేవ్‌ల సమస్యకు, ప్రస్తుత ఆందోళనలకు సంబంధం ఉందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీని గద్దె దించాలనే ఏకైక లక్ష్యంతో విపక్షాలు, కొన్ని విదేశీ శక్తులు కలిసి పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ అంశంపై ఆయన విడుదల చేసిన ఒక వీడియో ప్రస్తుతం విస్తృతంగా ప్రచారంలో ఉంది. 2015కు ముందు భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు ప్రపంచంలోనే అత్యంత విచిత్రంగా ఉండేదని విశ్వేశ్వర్ రెడ్డి వివరించారు. "బంగ్లాదేశ్‌లో భారత్‌కు చెందిన 111 ఎన్‌క్లేవ్‌లు (చిన్న భూభాగాలు), భారత్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన 51 ఎన్‌క్లేవ్‌లు ఉండేవి. ఈ ప్రాంతాల్లోని ప్రజలకు సరైన గుర్తింపు, పౌరసత్వం, ప్రభుత్వ సేవలు అందేవి కావు" అని ఆయన గుర్తుచేశారు. ప్రధాని మోదీ ప్రభుత్వం 2015లో చారిత్రక భూ సరిహద్దు ఒప్పందం ద్వారా ఈ సమస్యను పరిష్కరించిందని తెలిపారు. అలాంటి అసంబద్ధమైన సరిహద్దుల వల్ల అక్రమ వలసలు పెరిగిపోయాయని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కొన్ని పార్టీలు దీనిని ప్రోత్సహించాయని ఆయన ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, అసోంలో కాంగ్రెస్ పార్టీలు ఈ వలసలను ప్రోత్సహించాయని, దాని ప్రభావం హైదరాబాద్, ఢిల్లీ, బీహార్, ఒడిశా వరకు పాకిందని అన్నారు. ఇప్పుడు ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేస్తుంటే, అదే శక్తులు వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు. "విపక్షాలకు నీట్, యూపీఐ, ఎన్నికల సంఘం వంటి అంశాలపై ఉమ్మడి అభిప్రాయం లేదు. వారి ఏకైక ఉమ్మడి లక్ష్యం ప్రధాని మోదీని ఓడించడం, అధికార మార్పు తీసుకురావడం" అని విశ్వేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఒక నేతకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక్కసారిగా లక్షలాది ఫాలోవర్లు పెరగడం నూటికి నూరు శాతం నకిలీ అని, డబ్బుతో సృష్టించినవేనని ఆయన ఆరోపించారు. దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు కరెన్సీ, చమురు వాణిజ్యం, ఐటీ, ఫార్మా రంగాలపై కూడా ఒత్తిడి తెస్తున్నారని, ప్రధాని మోదీ బలమైన నాయకత్వం వల్లే దేశం నిలదొక్కుకోగలుగుతోందని ఆయన అన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణలో తప్పిదాలపై జర్నలిస్టుల ఫిర్యాదు

- తమ వాంగ్మూలాలు నమోదు చేయకుండానే చేసినట్లు పత్రాలు సృష్టించారని ఆరోపణ..
- సమగ్ర విచారణకు పోలీస్ కమిషనర్ హామీ



హనుమకొండ,అక్టోబర్ 17(నిత్యం నిఘా ప్రతినిధి): ఎస్సీ, ఎస్టీ కేసు విచారణలో జరిగినట్లు ఆరోపిస్తున్న తప్పిదాలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ జర్నలిస్టులు శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతకు ఫిర్యాదు చేశారు. సుబేదారి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ నంబర్ 471/2025 కేసు విచారణలో తమ వాంగ్మూలాలు తీసుకోకుండానే తీసుకున్నట్లు పత్రాలు సృష్టించి, వాటిని న్యాయస్థానానికి సమర్పించినట్లు తమ దృష్టికి వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో తాము సాక్షులుగా ఉన్నామని జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, తోట సుధాకర్, పెండెం వేణుమాధవ్, మేరుగుల రాజేంద్రప్రసాద్ తెలిపారు. విచారణ అధికారిగా ఉన్న హనుమకొండ ఏసీపీ నరసింహారావుతో పాటు ఇతర పోలీసు అధికారులు ఎవరూ తమను విచారణకు పిలవలేదని, తమ నుంచి ఎలాంటి వాంగ్మూలాలు తీసుకోలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ, 2025 ఆగస్టు 15న ఏసీపీ సమక్షంలో తాము వాంగ్మూలాలు ఇచ్చినట్లు పత్రాలు రూపొందించి, వాటిని న్యాయస్థానానికి సమర్పించి కేసును మూసివేసినట్లు తెలిసిందని ఆరోపించారు. ఈ విషయంపై సంబంధిత ఏసీపీని సంప్రదించగా, కేసు మూసివేశామని తెలిపినట్లు జర్నలిస్టులు వివరించారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కేసును ఎలా మూసివేస్తారని ప్రశ్నించగా, ఏమైనా ఉంటే కోర్టుకు వెళ్లి చూసుకోవాలని సమాధానం ఇచ్చినట్లు పేర్కొన్నారు. తమను విచారించకుండానే తమ పేర్లతో వాంగ్మూలాలు ఎలా నమోదు చేశారు? వాటిని ఏ ఆధారాలతో న్యాయస్థానానికి సమర్పించారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. సంబంధిత పోలీసు రికార్డులు, వాంగ్మూలాలు, న్యాయస్థానానికి సమర్పించిన పత్రాలను పరిశీలించి, విచారణలో బాధ్యులుగా తేలిన అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. కోర్టు ద్వారా పొందిన పత్రాలను కూడా పోలీస్ కమిషనర్‌కు అందజేశారు. ఫిర్యాదును, సమర్పించిన పత్రాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్ శ్వేత సానుకూలంగా స్పందించినట్లు ఫిర్యాదుదారులు తెలిపారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి విచారణ జరిపిస్తామని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇదే ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించి బాధితుడు కంకనాల సంతోష్ కూడా తనకు జరిగిన అన్యాయంపై పోలీస్ కమిషనర్‌కు మరో ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదుపై విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ వెల్ఫేర్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వల్లాల వెంకటరమణ, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శి ఊటుకూరు సాయిరాం, కోశాధికారి పాడిచెట్టి విష్ణువర్ధన్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, యూనియన్ రాష్ట్ర బాధ్యులు పెండెం వేణు మాధవ్, తోట సుధాకర్, బోళ్ల అమర్, మేరుగుల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళీ అమ్మవారు సరస్వతీ మాతగా దివ్యదర్శనం

- ఏడో రోజు అమ్మవారికి వైభవంగా రథసేవ.. భక్తులతో కిటకిటలాడిన ఆలయం
- రూ.కోటి వ్యయంతో రూపొందించిన 27 అడుగుల రథం ఆలయానికి అందజేత









వరంగల్, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్ నగరంలోని చారిత్రక శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శనివారం అమ్మవారు సరస్వతీ మాత అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు నిత్యాహ్నిక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అర్చకులు అమ్మవారిని సరస్వతీ మాతగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతీ మాతను దర్శించుకోవడం వల్ల భక్తులకు జ్ఞానం, విద్యాసంపద సిద్ధిస్తాయని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళీ శేషు తెలిపారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయం సందడిగా మారింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి రథసేవను వైభవంగా నిర్వహించారు. రథసేవలో పాల్గొని రథాన్ని లాగితే తమ జీవిత ప్రయాణం సాఫీగా సాగుతుందని భక్తులు విశ్వసిస్తారు. దీంతో భక్తులు ఉత్సాహంగా రథాన్ని లాగారు. నవరాత్రి సంప్రదాయాన్ని అనుసరించి కాళరాత్రి, రక్తబీజ సంహారానికి సంబంధించిన విశేష పూజలు నిర్వహించారు. భక్తుల భద్రకాళీ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఆయన సతీమణి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరులు ఉన్నారు. ఆలయ కార్య నిర్వహణాధికారి రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళీ శేషు పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక నవరాత్రి పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ మహామండపంలో ఆశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

రూ.కోటితో 27 అడుగుల రథం సమర్పణ

భక్తులకు మరింత వైభవంగా రథసేవ నిర్వహించేందుకు శాసనసభ్యుడు నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు తమ బంధుమిత్రుల సహకారంతో సుమారు రూ.కోటి వ్యయంతో 27 అడుగుల ఎత్తులో రూపొందించిన నూతన రథాన్ని ఆలయానికి సమర్పించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో రథాన్ని దేవస్థానానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు కమటం వేణుగోపాల్, కల్లూరి పవన్‌కుమార్, కటకం రాములు, కారెంగుల సురేష్‌బాబు, గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, చిదర అంజనీదేవి, మాడిశెట్టి సతీష్, పేరాల శ్రీనివాసరావు, రమేష్‌చంద్ భంగ్, మోతుకూరి మయూరి, రామేశ్వరరావు, మాజీ ధర్మకర్తలు జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్, గాండ్ల స్రవంతి, పాలడుగుల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు భద్రకాళీ అమ్మవారి జన్మోత్సవం

ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా భద్రకాళీ అమ్మవారి జన్మోత్సవాన్ని నిర్వహించనున్నారు. దుర్గ భద్రకాళిగా కోటి యోగినీ గణాలతో అమ్మవారు ఆవిర్భవించిన రోజుగా దీనికి విశేష ప్రాధాన్యం ఉంది. దుర్గాష్టమి రోజున బతుకమ్మను పేర్చి సద్దుల బతుకమ్మ సంప్రదాయాన్ని కొనసాగించడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖుల్లో మాజీ శాసనమండలి సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయభాస్కర్, నాగుర్ల వెంకటేశ్వర్లు, కె. వాసుదేవరెడ్డి తదితరులు ఉన్నారు. ఈ రోజు ఉత్సవ కార్యక్రమాలకు శారదా విద్యాసంస్థల అధినేత సందిపూడి రవిశంకర్–మానస దంపతులు, నాగభూషణం–శ్రీదేవి దంపతులు, డాక్టర్ బి. వెంకటేశ్వర్లు–సునీత దంపతులు, డాక్టర్ బి. సనత్‌కుమార్, డాక్టర్ సాహితి దంపతులు, డాక్టర్ బి. వైష్ణవి, జోశ్యుల కామేశ్వరశర్మ–కిరణ్మయి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.
రామల సునీత, కార్యనిర్వహణాధికారి

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన కాకులమర్రి లక్ష్మణ్‌బాబు

- భూక్య బదిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు..
- కుటుంబ సభ్యులకు పరామర్శ



ములుగు జిల్లా / మల్లంపల్లి, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా మల్లంపల్లి మండలం శ్రీనగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త భూక్య దేవేందర్ తల్లి భూక్య బదిలీ అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు శనివారం శ్రీనగర్ గ్రామంలోని ఆమె నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా దివంగత భూక్య బదిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు పోరిక గోవింద నాయక్, భూక్య జంపన్న, కాకులమర్రి ప్రదీప్‌రావు, మల్లంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు పాలప్ శ్రీనివాస్, మాచర్ల ప్రభాకర్, సర్పంచ్ ఆకుల మల్లేశం, ఉపసర్పంచ్ వీరు నాయక్, ఆకునూరి రమేష్, తోట శ్రీను, ఆకుల రమేష్, తోట వేణు, రాజు, రాములు, గోల్కొండ రాజు, మెరుగు రాజు, మహమ్మద్ పాషా, మహమ్మద్ జానీ, అనిల్, భూక్య మురళి, గడ్డమీద భాస్కర్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

మహిళలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక



హనుమకొండ, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను జిల్లా మహిళలందరూ ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆకాంక్షించారు. ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని శనివారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లా మహిళలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రకృతిని ప్రేమించడం, పూలను పూజించడం మన తెలంగాణ సంప్రదాయంలోని గొప్ప విశేషాలని తెలిపారు. ప్రజలందరూ సంతోషంగా, భక్తిభావంతో సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొని పండుగను ఘనంగా జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

కష్టపడితే విజయం మనదే

- పట్టభద్రుల ఓటరు నమోదుకు 18 ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు
- కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలి.. మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



హనుమకొండ, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసినట్లు మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ నాయకుడు దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకునేందుకు నియోజకవర్గవ్యాప్తంగా 18 ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. శనివారం హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీకి కీలకమని, ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతాయుతంగా పని చేయాలని పిలుపునిచ్చారు. గతంలో తమ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో కొంత వెనుకబడ్డామని, ఆ పథకాల గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించలేకపోయామని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రజల్లో మార్పు కనిపిస్తోందని, ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారని వినయ్ భాస్కర్ ధీమా వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కష్టపడి పనిచేస్తే విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ, రానున్న రెండేళ్లలో పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎర్రబెల్లి ప్రదీప్ రావు

- అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి
- భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజ ఐక్యతకు ఉత్సవాలు దోహదం



వరంగల్, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కరీమాబాద్ సుభాష్ ప్రాంతంలో శ్రీ జగదాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నవితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహిస్తూ అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జగదాంబ యూత్ అసోసియేషన్ సభ్యులు గొడిశాల కోమల్ గౌడ్, గొడిశాల కార్తీక్ గౌడ్, నాగపురి అరుణ్, అంకిత్, బీజేపీ మండల అధ్యక్షుడు బోరిగం, జిల్లా నాయకులు పూజ అజయ్ గౌడ్, మోడం రాజశేఖర్ తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

యువతలో ఆరోగ్యంపై అవగాహనకు మారథాన్లు దోహదం

- ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026లో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- విజేతలకు పతకాలు అందజేసి అభినందించిన ప్రముఖులు



హనుమకొండ, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతోపాటు శారీరక దృఢత్వాన్ని ప్రోత్సహించేందుకు మారథాన్లు ఎంతగానో దోహదపడతాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం మైదానంలో నిర్వహించిన 'ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ క్రీడా కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మారథాన్‌లో ప్రతిభ కనబరిచిన విజేతలకు పతకాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ, ఇలాంటి క్రీడా కార్యక్రమాలు యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంచడమే కాకుండా శారీరక దృఢత్వాన్ని మెరుగుపరుస్తాయని తెలిపారు. నిత్యజీవితంలో క్రమశిక్షణ, పట్టుదల అలవర్చుకోవడానికి క్రీడలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. యువత చదువుతోపాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. మారథాన్‌లో నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన యువతీయువకులు, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

యువతలో ఆరోగ్యంపై అవగాహనకు హాఫ్ మారథాన్‌లు దోహదం

- ట్రై సిటీస్ హాఫ్ మారథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న యువత, అథ్లెట్లు
- శారీరక దృఢత్వం, క్రమశిక్షణకు పరుగు ఎంతో ముఖ్యం: డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల

హనుమకొండ, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి నిదర్శనమని తొర్రూరు తహసీల్దార్ గడీల శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సంయుక్తంగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులంతా సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ మహిళలు ఆడిపాడడంతో కార్యాలయాల ప్రాంగణాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. పూలనే దేవతగా కొలుస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రత్యేకతను చాటుతుందని తహసీల్దార్, ఎంపీడీవో పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల జీవన విధానానికి, మహిళల ఆత్మగౌరవానికి, సామాజిక సంస్కృతికి అద్దం



పట్టే ఈ పండుగ ప్రజల జీవితాల్లో అంతర్భాగంగా నిలిచిందని తెలిపారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుతూ, భావి తరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో



మండల పంచాయతీ అధికారి హరిప్, హుస్సేన్, గృహ నిర్మాణ శాఖ సహాయ ఇంజినీర్లు యామిని, బిందు, సర్పంచులు సంకేపల్లి స్వాతి, మాలోత్ మౌనిక, భానోత్ రజిని, విజయ లింబ, సావిత్రి, శ్రీనివాస్, బంగారు రమేష్, భానోత్ విద్యాసాగర్, అంగన్‌వాడీ పర్యవేక్షకులు గౌస్య, శ్రీదేవి, గ్రామ పంచాయతీ అధికారి ధరణి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత ఆరోగ్యంపై దృష్టి సారించాలి..
క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి

- వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026 రెండో ఎడిషన్‌ను ప్రారంభించిన మంత్రి

హనుమకొండ, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నాయిని విశాల్ ట్రస్ట్, క్రెడాయ్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026 రెండో ఎడిషన్‌కు శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఐదు కిలోమీటర్ల పరుగును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, నిత్యం శారీరక వ్యాయామం, క్రీడలు, ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడి, ఆందోళనతో పాటు పలు ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని

సూచించారు. ఈ మారథాన్‌లో పాల్గొనేందుకు సుమారు నాలుగు నుంచి ఐదు వేల మంది నమోదు చేసుకోవడం సంతోషకరమన్నారు. వరంగల్, హనుమకొండ నగరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. వరంగల్ విమానాశ్రయం, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే వారికి తగిన అవకాశాలు కల్పించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని సూచించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ యువతలో పెరుగుతున్న ఒత్తిడి, ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక



ఒత్తిడిని తగ్గించి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తెలిపారు. నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ శ్రీగోదా రెడ్డిలను అభినందించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంచడం, ప్రజల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే మారథాన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి కార్యక్రమానికి మరింత స్పందన లభించడం సంతోషకరమన్నారు. మారథాన్ విజయవంతానికి సహకరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, క్రెడాయ్ ప్రతినిధులు, ప్రాయోజకులు, నిర్వాహకులు, క్రీడాకారులు, యువతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, మారథాన్ నిర్వాహకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పరుగువీరులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువత ఉత్సాహంగా పరుగులో పాల్గొనడంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది

బతుకమ్మ వేడుకలకు భద్రతా ఏర్పాట్ల పరిశీలన

- బెస్తం చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించిన మామునూరు సీఐ శ్రీనివాస్
- మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచన



వరంగల్, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): 41, 42, 43వ డివిజన్ల మహిళలు బతుకమ్మ వేడుకలను సురక్షితంగా నిర్వహించుకునేందుకు బెస్తం చెరువు వద్ద ఏర్పాటు చేస్తున్న ఆట స్థలాన్ని అధికారులు పరిశీలించారు. మామునూరు సీఐ శ్రీనివాస్, కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్, మున్సిపాలిటీ పనుల పరిశీలకుడు వేణు, నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది కలిసి ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెరువులో నీటి మట్టం తక్కువగా ఉన్న నేపథ్యంలో బతుకమ్మ ఆడే సమయంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీ, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని తెలిపారు. మహిళలు సురక్షిత వాతావరణంలో ఆనందంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు.

సద్దుల బతుకమ్మ వేళ.. పూల కొనుగోళ్ల సందడి!

- మంథని అంబేద్కర్ చౌరస్తాలో రంగురంగుల పూలతో కళకళ



పెద్దపల్లి జిల్లా, మంథని, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి); తెలంగాణ ఆడపడుచుల సంప్రదాయ పండుగ సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని మంథని పట్టణంలో పూల కొనుగోళ్ల సందడి నెలకొంది. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా రంగురంగుల పూలతో కళకళలాడుతోంది. బతుకమ్మలను అందంగా పేర్చేందుకు అవసరమైన తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలను కొనుగోలు చేసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పూలతో నిండిన మార్కెట్‌లో మహిళలు తమకు నచ్చిన పూలను ఎంపిక చేసుకుంటూ పండుగ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కుటుంబ సభ్యులతో కలిసి పూల కొనుగోళ్లు చేయడంతో అంబేద్కర్ చౌరస్తా పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. పండుగ నేపథ్యంలో పూల వ్యాపారాలు కూడా ఊపందుకున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకునేందుకు మహిళలు సిద్ధమయ్యారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ వేడుకల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతున్నారు. పూల పరిమళాలు, మహిళల సందడితో మంథని పట్టణం పండుగ శోభను సంతరించుకుంది.

బదిలీలు, పదోన్నతుల వ్యవహారంలో అవినీతి ఆరోపణలు.. ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

- డీఐజీ కార్యాలయంలో సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్‌పై వేటు

వరంగల్, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని డీఐజీ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు సస్పెన్షన్‌కు గురయ్యారు. సూపరింటెండెంట్ యుగంధర్, సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్‌లను అధికారులు సస్పెండ్ చేసినట్లు సమాచారం. బదిలీలు, పదోన్నతులు, శిక్షా చర్యలకు సంబంధించిన వ్యవహారాల్లో అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఈ చర్యకు కారణమైనట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై బాధితులు డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదుపై స్పందించిన డీజీపీ విచారణకు ఆదేశించగా, ఆయన ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్, భద్రాద్రి జోన్ డీఐజీ శ్వేత ప్రాథమిక విచారణ చేపట్టినట్లు తెలిసింది. విచారణలో వెల్లడైన వివరాల ఆధారంగా గురువారం రాత్రి ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఈ ఘటన పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఆరోపణలపై



తదుపరి విచారణలో మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. అయితే, ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలు, అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

మంత్రి వస్తే భక్తుల దర్శనానికి అడ్డంకులా?

- **భద్రకాళి ఆలయంలో సామాన్య భక్తులకు ఇన్ని ఇబ్బందులా..?**
- **తాగునీరు, పార్కింగ్ కరువు.. చిన్నారులు, వృద్ధుల అవస్థలు**
- **భక్తులను గంటల తరబడి నిలిపివేయడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆగ్రహం**



వరంగల్, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ నగరంలోని ప్రసిద్ధ శ్రీ భద్రకాళి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎదురవుతున్న ఇబ్బందులపై బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి పర్యటన పేరుతో అమ్మవారి దర్శనానికి వచ్చిన సామాన్య భక్తులను గంటల తరబడి నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అమ్మవారి సన్నిధిలో సామాన్య భక్తులకు ఒక న్యాయం, అధికారంలో ఉన్నవారికి మరో న్యాయమా అని ఆలయ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నప్పటికీ తాగునీరు, పార్కింగ్, క్రమబద్ధమైన దర్శన ఏర్పాట్లు సరిగా లేవని ఆయన ఆరోపించారు. అమ్మవారిపై అపారమైన భక్తితో కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం దేవస్థానం, అధికార యంత్రాంగం బాధ్యత అని పేర్కొన్నారు. తాను సైతం అమ్మవారి దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని తెలిపారు. భక్తుల ఇబ్బందులను పట్టించుకోకుండా అధికారులు, పోలీసు యంత్రాంగం వ్యవహరించడం బాధాకరమన్నారు.

చిన్నారులు, వృద్ధులకు తప్పని అవస్థలు

ముఖ్యంగా మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన చిన్నారులను గంటల తరబడి నిలబెట్టడం ఆవేదన కలిగిస్తోందని రవికుమార్ అన్నారు. చంటిపిల్లలతో వచ్చిన తల్లిదండ్రులకు కనీసం తాగునీరు కూడా అందుబాటులో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి తగిన ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించలేదని విమర్శించారు. దర్శనానికి వచ్చే భక్తులకు కలిగే అసౌకర్యం వారి ఆధ్యాత్మిక అనుభూతికి ఆటంకంగా మారుతోందన్నారు.

అందరికీ సమాన దర్శనం కల్పించాలి

అమ్మవారి సన్నిధిలో హోదాలు, పలుకుబడితో సంబంధం లేకుండా ప్రతి భక్తుడికి సమానంగా దర్శనం కల్పించాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు. తాగునీటి సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని, క్యూలైన్లను క్రమబద్ధీకరించాలని కోరారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని సూచించారు. దర్శన సమయాలపై స్పష్టమైన సమాచారం అందిస్తూ, రాజకీయ లేదా అధికార హోదాతో సంబంధం లేకుండా భక్తుల విశ్వాసానికి గౌరవం ఇవ్వాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా దేవస్థాన అధికారులు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈదు బోడు మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేయాలి

- **అభివృద్ధి పేరుతో పర్యావరణ విధ్వంసం తగదు**
- **తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలి.. చెరువుల మట్టిని వినియోగించాలి**



హన్మకొండ/ఆత్మకూరు, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): నాగ్‌పూర్ నుంచి విజయవాడకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనుల కోసం ఈదు బోడు నుంచి మట్టి తరలింపును తక్షణమే నిలిపివేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. పర్యావరణం, వృక్ష సంపద, వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, అభివృద్ధి పేరుతో సహజ వనరులను ధ్వంసం చేయడం తగదని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం గ్రామస్తులు, అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, గనుల శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ.. ఆత్మకూరు మండలం పెద్దాపూర్ శివారులో అక్కంపేట–నాగయ్యపల్లి గ్రామాల సరిహద్దులోని సర్వే నంబరు 950లో 9 ఎకరాల 35 గుంటల విస్తీర్ణంలో ఈదు బోడు విస్తరించి ఉందన్నారు. ఇది కేవలం మట్టి, రాళ్ల దిబ్బ మాత్రమే కాదని, చుట్టుపక్కల మూడు గ్రామాల పర్యావరణానికి కీలకమైన సహజ వనరుల కేంద్రంగా ఉందని తెలిపారు. ఇక్కడ వివిధ రకాల చెట్లు, పక్షులు, వన్యప్రాణులు, ఇతర జీవరాశులు ఉన్నాయని వివరించారు.

దళితుల భూమికి, శ్మశానవాటికకు ముప్పు

2012లో అప్పటి ప్రభుత్వం ఇందిరమ్మ పచ్చతోరణం పథకం కింద ఈ ప్రాంతంలోని ఆరు ఎకరాలను దళిత వితంతువులకు పండ్ల తోటల పెంపకం కోసం కేటాయించిందని రాజేందర్ గుర్తుచేశారు. మిగిలిన స్థలంలో నాగయ్యపల్లి గ్రామానికి చెందిన బీసీల శ్మశానవాటికతో పాటు చెత్త వ్యర్థాల నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మట్టి తవ్వకాలు చేపడితే దళిత వితంతువుల ఉపాధికి, శ్మశానవాటికకు, చెత్త నిల్వ కేంద్రానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈదు బోడును తవ్వడం వల్ల భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడటంతో పాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, భవిష్యత్తులో నీటి ఎద్దడి పెరిగే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. చెట్లు, వన్యప్రాణుల ఆవాసాలు దెబ్బతినడంతో పాటు కాలుష్యం పెరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సహజ వనరులను కాపాడుకోకపోతే భవిష్యత్తు తరాల మనుగడకు ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.

చెరువుల మట్టిని వినియోగించాలి

గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి మట్టి అవసరమైతే మూడు గ్రామాల పరిధిలోని చెరువుల్లో పేరుకుపోయిన మట్టిని నిబంధనలకు అనుగుణంగా వినియోగించే అవకాశాలను పరిశీలించాలని చుంచు రాజేందర్ సూచించారు. దీనివల్ల రహదారి నిర్మాణానికి మట్టి అందడంతో పాటు చెరువుల్లో పూడిక తొలగింపునకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఈదు బోడు తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేసి, మట్టి తరలింపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, సంబంధిత అధికారులు, మూడు గ్రామాల సర్పంచులు ఈ అంశంపై తక్షణమే స్పందించాలని కోరారు. తవ్వకాలను నిలిపివేయకపోతే మూడు గ్రామాల ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ సమితి జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నేరెళ్ల బస్వారెడ్డి, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకుడు మాదాసి దేవరాజు, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు మాదాసి ఎర్ర సూరయ్య, మండల నాయకుడు మాదాసి ప్రభాకర్ మాదిగ, ధర్మ సమాజ్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మాదాసి రాజు తదితరులు పాల్గొన్నారు.

పని పర్యవేక్షణ నుంచి బతుకమ్మ సంబరాల వరకు..

- **అభివృద్ధి పనుల పరిశీలన అనంతరం మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి కుమార్**



ములుగు జిల్లా / మల్లంపల్లి, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): అభివృద్ధి పనుల పర్యవేక్షణతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యమిస్తూ మల్లంపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి కుమార్ బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. మల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న వీబీజీ రామ్ జీ పనులను పరిశీలించేందుకు వచ్చిన ఆయన, పనుల పురోగతిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. విధి నిర్వహణలో భాగంగా అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం స్థానిక మహిళలతో కలిసి పండుగలో పాల్గొనడం గ్రామస్థుల్లో ఆనందాన్ని నింపింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి కుమార్, నాలుగో వార్డు సభ్యుడు జింక వేణు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సై రాజకుమార్‌కు సీనియర్ జర్నలిస్టుల సన్మానం



వరంగల్ జిల్లా, పర్వతగిరి, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన పేగడ రాజకుమార్‌ను సీనియర్ జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు బోనాల సాంబయ్య, దొడ్డ శ్రీనివాస్, గొల్లపల్లి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ఆరవ రోజు శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు

- **చదువుల తల్లికి భక్తుల ప్రత్యేక పూజలు**
- **ఆదివారం మంథని పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు.. గోపాల కాలువల కార్యక్రమం**



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి) దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం మంథని పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చదువుల తల్లి సరస్వతీ దేవి రూపంలో అమ్మవారిని దేదీప్యమానంగా అలంకరించడంతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మంథని పట్టణ పురవీధుల గుండా ఊరేగించనున్నట్లు ఆలయ అర్చకుడు మారుపాక ప్రశాంత్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కనుకుంట్ల బాబు తెలిపారు. పట్టణంలోని వివిధ వీధుల్లో ఉట్టి కట్టి గోపాల కాలువల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సకల విద్యలకు, జ్ఞానానికి, సంగీతానికి, సాహిత్యానికి, కళలకు అధిదేవత శ్రీ సరస్వతీ మాత. తెల్లని వస్త్రాలు ధరించి, కమలాసనంపై ఆసీనురాలై, చేతిలో వీణను ధరించిన అమ్మవారి రూపం ప్రశాంతతకు, పవిత్రతకు, జ్ఞానానికి ప్రతీకగా భక్తులు భావిస్తారు. సంపద కంటే విద్య, అధికారానికి మించినది జ్ఞానం, అందానికి మించినది మంచి సంస్కారం అనే సందేశాన్ని సరస్వతీ మాత ఆరాధన అందిస్తుంది. అమ్మవారి అనుగ్రహంతో చిన్నారులకు విద్యాబుద్ధులు, విద్యార్థులకు ఏకాగ్రత, యువతకు ఉజ్వల భవిష్యత్తు, ప్రతి కుటుంబానికి సుఖశాంతులు కలగాలని భక్తులు ప్రార్థిస్తున్నారు. అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించే చదువుల తల్లికి భక్తులు శతకోటి వందనాలు సమర్పిస్తున్నారు.

సద్దుల బతుకమ్మ వేళ.. 'స్వచ్ఛ అన్నారం'కు శ్రీకారం

- **గ్రామ వీధుల్లో పారిశుద్ధ్య కార్యక్రమం ప్రారంభించిన సర్పంచ్ గాడిపల్లి మహేందర్**



అన్నారం షరీఫ్ / పర్వతగిరి మండలం, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలో సర్పంచ్ గాడిపల్లి మహేందర్ 'స్వచ్ఛ అన్నారం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామంలోని వీధులు, రహదారులను శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. పండుగ వేళ గ్రామంలో పరిశుభ్రతను పాటిస్తూ అందరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత, మహిళా సంఘాల సభ్యులు, యువజన నాయకులు, గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

పెద్దమడుర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు.. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



జనగామ జిల్లా, పాలకుర్తి, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి):జనగామ జిల్లా దేవరుప్పుల మండలం పెద్దమడుర్ గ్రామంలో బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారం ఏడో రోజు సద్దుల బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడటంతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. మహిళలతో మమేకమై కోలాటం ఆడుతూ ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా గ్రామ ఆడబిడ్డలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను సేకరించి అందంగా పేర్చి, గౌరమ్మను ప్రతిష్ఠించి పూజించే ఈ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమానికి బతుకమ్మ పండుగ స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్వహించడంతో పాటు ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలను అందించారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల పంపిణీలో జాప్యం జరుగుతోందని విమర్శించారు. బతుకమ్మను నిమజ్జనం చేసేందుకు చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయని, తాను బతుకమ్మ వేడుకలకు వస్తున్న సమయంలోనే విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని పేర్కొంటూ ప్రభుత్వ పాలనపై విమర్శలు చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు, గ్రామ మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో ఘనంగా ముగ్గుల పోటీలు





భద్రాచలం, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): భద్రాచలం పట్టణంలోని భగవాన్ దాస్ కాలనీ, గోల్డ్ స్మిత్ కాలనీ, సీతారామ్ నగర్, డ్రైవర్స్ కాలనీల శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకరణ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు కన్నులపండువగా సాగాయి.ఈ పోటీలకు భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణదొర, అటవీశాఖ రేంజ్ అధికారి జశ్వంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సుమారు 100 మందికి పైగా మహిళలు పోటీల్లో పాల్గొని, రంగురంగుల రంగవల్లులు, వినూత్నమైన ఆకృతులతో తమ సృజనాత్మకతను చాటుకున్నారు. మహిళల ఉత్సాహంతో పోటీ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. మొదటి నుంచి ఎనిమిదో బహుమతి వరకు వరుసగా రాజరాజేశ్వరి, శకుంతల, సౌజన్య, సౌమ్య, హితశ్రీ, త్రివేణి, జ్యోత్స్న, నేహా విజేతలుగా నిలిచారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పూనెం కృష్ణదొర మాట్లాడుతూ, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు మహిళల్లోని సృజనాత్మక ప్రతిభను వెలికితీయడంతోపాటు కాలనీవాసుల మధ్య ఐక్యత, ఆత్మీయతను పెంపొందిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు కుంజా ధర్మా, భూక్యా రంగా, వార్డు సభ్యురాలు సున్నం భూలక్ష్మి, బండారిగూడెం దేవుడమ్మ, బండి రాంప్రసాద్, రామకృష్ణ, హరిబాబు, కుంజా సంతోష్, భూక్యా సాయి కౌశిక్, షేక్ సిరాజ్, ఆశాలత తదితరులు పాల్గొన్నారు. స్థానిక కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

చెరుకూరులో ఘనంగా వాలీబాల్ టోర్నమెంట్



చెరుకూరు, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి):విజయదశమి సందర్భంగా చెరుకూరు గ్రామ పంచాయతీలో మహంకాళి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ఉత్సాహంగా ముగిసింది. అక్టోబర్ 16, 17 తేదీల్లో రెండు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొన్నాయి.టోర్నమెంట్‌లో శ్రీరామ్ నగర్ జట్టు విజేతగా నిలిచి మొదటి బహుమతిని కైవసం చేసుకోగా, చెరుకూరు గ్రామ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బయ్యారం జట్టు మూడో బహుమతిని సాధించింది. విజేతలకు మహంకాళి యూత్ తరఫున మొదటి బహుమతిగా రూ.10,000, ఆదివాసీ నవనిర్మాణ సేన (ఏఎన్ఎస్) తరఫున రెండో బహుమతిగా రూ.5,000 అందజేశారు. మూడో బహుమతిని కూడా ఏఎన్ఎస్ తరఫున అందించారు. విజేతలకు షీల్డులు, పతకాలను కొత్తగట్టు శ్రీనివాసరావు అందజేశారు.ఈ సందర్భంగా ఏఎన్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు, మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడంతోపాటు, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని అన్నారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలను భవిష్యత్తులో మండల స్థాయిలో కూడా నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మహంకాళి యూత్ సభ్యులు, ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా, మండల నాయకులు, చెరుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామస్థులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు.

ఎన్‌హెచ్‌ఎం సమ్మెతో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు

- టీకాల కార్యక్రమం కొనసాగించాలి.. సద్దుల బతుకమ్మకు ప్రత్యేక వైద్య ఏర్పాట్లు
- ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య



హనుమకొండ, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి):జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య ఆదేశించారు. చిన్నపిల్లల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగించాలని, ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శనివారం ఆయన జిల్లాలోని కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు బోడగుట్ట, వడ్డేపల్లి, సోమిడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సేవలు, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకరు, బోడగుట్ట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు, సోమిడి పట్టణ ఆరోగ్య కేంద్రంలో తొమ్మిది మంది, వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో 12 మంది, వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో 14 మంది ఉద్యోగులు విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. అందుబాటులో ఉన్న రెగ్యులర్ సహాయక నర్సు-మంత్రసానులు (ఏఎన్ఎంలు), మహిళా పర్యవేక్షక సిబ్బంది సహకారంతో టీకాల కార్యక్రమాన్ని, గ్రామాలు, కాలనీల్లో నిర్వహించే టీకాల శిబిరాలను కొనసాగించాలని ఆదేశించారు. సమ్మె కారణంగా ప్రజలు వైద్య సేవలకు ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

సద్దుల బతుకమ్మకు ప్రత్యేక వైద్య ఏర్పాట్లు

రాబోయే సద్దుల బతుకమ్మ పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని అన్ని వైద్య సంస్థల అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని డాక్టర్ అప్పయ్య సూచించారు.



పండుగ నిర్వహించే ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అత్యవసర వైద్య సేవల కోసం పురుష సిబ్బందిని విధుల్లో నియమించాలని ఆదేశించారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే మహిళా ఉద్యోగులకు ఇబ్బందులు కలగకుండా, పండుగలో పాల్గొనని మహిళా ఉద్యోగుల సేవలను అవసరానికి అనుగుణంగా వినియోగించుకొని వైద్య సేవలు కొనసాగించేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ప్రజలకు అత్యవసర వైద్య సహాయం అందుబాటులో ఉండేలా సిబ్బంది విధులను ముందుగానే కేటాయించాలని, అవసరమైన మందులు, ప్రథమ చికిత్స సామగ్రిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. సమ్మె పరిస్థితులు, పండుగ ఏర్పాట్ల నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ జిల్లాలోని అన్ని వైద్య సంస్థల్లో సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ అప్పయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత, పర్యవేక్షక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వివిధ పోటీలు

- వ్యాసరచన, లఘుచిత్రాలు, ఛాయాచిత్రాల పోటీలకు ఆహ్వానం
- అక్టోబర్ 19 నుంచి 24 వరకు వేర్వేరు గడువులు.. విజేతలకు బహుమతులు, రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం

వరంగల్, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి):పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీసు పతాక దినోత్సవం సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు, యువత, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, రచయితలు, పాత్రికేయుల కోసం వ్యాసరచన, లఘుచిత్రాలు, ఛాయాచిత్రాలు, వ్యాసాలు–విశేష వ్యాసాల పోటీలు నిర్వహిస్తున్నారు. ఆయా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు అందించడంతోపాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నారు.

వ్యాసరచన పోటీలు

తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో నిర్వహించే వ్యాసరచన పోటీల్లో 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు, డిగ్రీ ఆపై చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చు. 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 'నేరాల నివారణలో పోలీసుల–పౌరుల పాత్ర', 'మాదకద్రవ్యాల నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు వాటికి ఎలా దూరంగా ఉండాలి' అనే అంశాలను కేటాయించారు. డిగ్రీ, ఆపై చదువుతున్న వారికి 'సామాజిక మాధ్యమాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర', 'తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర' అనే అంశాలపై పోటీలు నిర్వహిస్తారు. వ్యాసాన్ని కాగితంపై రాసి, ఫొటో తీసి, పీడీఎఫ్ రూపంలోకి మార్చి ఈ నెల 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో పంపాలి. వ్యాసం 500 పదాలకు మించకూడదు.నమోదు కోసం https://forms.gle/YkeKUscWu5LFYWFH7 లింక్‌ను ఉపయోగించాలి.

లఘుచిత్రాలు, ఛాయాచిత్రాల పోటీలు

పోలీసు అమరవీరుల త్యాగాలు, పోలీసుల విధులు, ప్రతిభ, ప్రజల రక్షణ తదితర అంశాలపై మూడు నిమిషాలకు మించకుండా లఘుచిత్రాలను రూపొందించి ఈ నెల 23వ తేదీ సాయంత్రంలోగా హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని ప్రజాసంబంధాల అధికారి (పీఆర్ఓ)కు అందజేయాలి. లఘుచిత్రాలను పెన్‌డ్రైవ్‌లో భద్రపరిచి సమర్పించాలి. ఎంపికైన మూడు ఉత్తమ లఘుచిత్రాలను రాష్ట్రస్థాయి పోటీల కోసం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి పంపిస్తారు. ఇదే అంశాలపై ఛాయాచిత్రాల పోటీలను కూడా నిర్వహిస్తున్నారు. ఆసక్తి గలవారు 10×8 అంగుళాల పరిమాణంలో మూడు ఫొటోలను ఈ నెల 23వ తేదీ సాయంత్రంలోగా హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పీఆర్ఓకు అందజేయాలి. ఎంపికైన మూడు ఉత్తమ ఛాయాచిత్రాలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు.



రచయితలు, పాత్రికేయులకు ఆహ్వానం

పోలీసుల త్యాగాలు, వృత్తిపరమైన కృషి అంశాలపై ప్రముఖ రచయితలు, పాత్రికేయులు రాసిన వ్యాసాలు, విశేష వ్యాసాలను కూడా ఆహ్వానిస్తున్నారు. వీటిని ఈ నెల 19వ తేదీ సాయంత్రంలోగా హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పీఆర్ఓకు అందజేయాలి. ఎంపిక చేసిన రచనలను అక్టోబర్ 21 నుంచి వారం రోజులపాటు తెలుగు, ఆంగ్లం, ఉర్దూ వార్తాపత్రికల్లో ప్రచురించనున్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, పోలీసుల సేవలు–ప్రజా భద్రతపై అవగాహన పెంపొందించే ఈ కార్యక్రమాల్లో అర్హులైన వారు, ఆసక్తి గలవారు పాల్గొనాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కోరింది.

వైభవంగా బతుకమ్మ, దసరా ఉత్సవాలు నిర్వహిస్తాం

- అందరి సహకారంతో గతేడాది కంటే ఘనంగా వేడుకలు.. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపురి సంజయ్‌బాబు

హనుమకొండ, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): బతుకమ్మ, దసరా ఉత్సవాలను గతేడాది కంటే మరింత ఘనంగా, వైభవంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపురి సంజయ్‌బాబు తెలిపారు. శనివారం కరీమాబాద్‌లోని ఆదర్శ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలందరి సహకారంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వేడుకలు సజావుగా సాగేందుకు మున్సిపల్ శాఖ, విద్యుత్ శాఖ, పోలీసు అధికారులు సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా నాయకులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సహకరిస్తే ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలందరూ కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఉత్సవాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిటీ తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మేడిది మధుసూదన్, మండ వెంకన్న, గోనె రాంప్రసాద్, వడ్నాల నరేందర్, బత్తిని అఖిల్‌తోపాటు ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

తంగేడు పూల సాక్షిగా.. తరతరాల సంస్కృతి బతుకమ్మ

- **ప్రకృతి ఆరాధనకు, మహిళల ఆత్మీయతకు ప్రతీక పూల పండుగ**
- **బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావ్**



ములుగు, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): తంగేడు పూల పసిడి కాంతులు.. గునుగు పూల రంగుల సోయగాలు.. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు.. వాటి చుట్టూ లయబద్ధంగా కదిలే మహిళల అడుగులు.. పల్లె జీవనాన్ని ప్రతిబింబించే పాటలు.. ఇవన్నీ కలగలిసిన ప్రకృతి పూల సంబరం బతుకమ్మ అని ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలలో దైవత్వాన్ని దర్శిస్తూ, కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. బతుకమ్మ, విజయదశమి పండుగల సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణలో అనేక సంస్కృతులు, ఆచారాలు, సంప్రదాయాలు ఉన్నప్పటికీ బతుకమ్మ పండుగకు ప్రత్యేక స్థానం ఉందని కలెక్టర్ అన్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి ప్రకృతి సిద్ధమైన పూలను అందంగా పేర్చి ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకత అని వివరించారు. ఒక్కో పువ్వును జాగ్రత్తగా అమర్చి బతుకమ్మకు అందమైన రూపాన్ని ఇవ్వడంలో మహిళల కళాత్మకత, ఓర్పు, సృజనాత్మకత ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. పూల సేకరణ నుంచి బతుకమ్మను సిద్ధం చేసే వరకు కుటుంబ సభ్యులంతా కలిసి పాల్గొనడం ఆత్మీయ అనుబంధాలను మరింత బలపరుస్తుందన్నారు.

పాటల్లో పల్లె జీవనం.. ఆటల్లో ఆత్మీయత

బతుకమ్మ పాటల్లో తెలంగాణ యాస, పల్లె జీవనం, కుటుంబ అనుబంధాలు, తరతరాల అనుభవాలు ప్రతిధ్వనిస్తాయని కలెక్టర్ తెలిపారు. మహిళలంతా ఒకచోట చేరి వలయంగా తిరుగుతూ చప్పట్లు కొడుతూ పాడే పాటలు తెలంగాణ మౌఖిక సాహిత్య సంపదకు నిదర్శనమన్నారు. అమ్మమ్మలు, నానమ్మలు పాడిన పాటలను చిన్నారులకు నేర్పించడం ద్వారా భాషా మాధుర్యాన్ని, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు అందించవచ్చని సూచించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా పుట్టింటికి చేరే ఆడబిడ్డలతో ఇళ్లలో సందడి నెలకొంటుందని, ఇరుగుపొరుగు మహిళల ఆత్మీయ కలయికతో గ్రామాలు, పట్టణాల్లో పండుగ వాతావరణం వెల్లివిరుస్తుందని పేర్కొన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ కలిసి బతుకమ్మ ఆడటం సామూహిక ఆనందానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. పెద్దలు బతుకమ్మలను పేర్చే సమయంలో చిన్నారులు పూల పేర్లు తెలుసుకుంటూ, పాటలు వింటూ స్థానిక సంప్రదాయాలను నేర్చుకుంటారని వివరించారు.

ప్రకృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యత

ప్రకృతి ఒడిలో లభించే పూలతో జరుపుకునే బతుకమ్మ పండుగ పర్యావరణ పరిరక్షణ బాధ్యతను గుర్తుచేస్తుందని కలెక్టర్ అన్నారు. సహజ పూలతో బతుకమ్మలను పేర్చడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, చెరువులు, ఇతర జలవనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. ప్రకృతిని ప్రేమించే సంస్కృతిని కొనసాగిస్తూనే ప్రకృతి సంపదను పరిరక్షించే చైతన్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. పండుగ వేడుకల్లో మహిళలు, చిన్నారులు సంతోషంగా పాల్గొనేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. బతుకమ్మ నిమజ్జనం సమయంలో చెరువులు, నీటి వనరుల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. పండుగ ఆనందం ప్రతి ఇంటా వెల్లివిరియాలని, ప్రజలంతా పరస్పర గౌరవం, ఐక్యతతో వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పూల పరిమళాలు ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు తీసుకురావాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆకాంక్షించారు. జిల్లా ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, మీడియా ప్రతినిధులకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- **హనుమకొండ కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా.. ఉద్యోగుల పోరాటానికి రావు పద్మ మద్దతు**
- **ఉద్యోగ భద్రత, న్యాయమైన వేతనాలు, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్**



హనుమకొండ, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద పనిచేస్తున్న సుమారు 17 వేల మంది కాంట్రాక్టు, పొరుగు సేవల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రావు పద్మ హాజరై ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిరంతరం సేవలందిస్తున్న వైద్యులు, సహాయక నర్సు-మంత్రసానులు (ఏఎన్ఎంలు), ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడంతో సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు సేవలకు తగిన న్యాయమైన వేతనాలు చెల్లించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని సిబ్బందికి ఆరోగ్య కార్డులతో పాటు సమగ్ర ఆరోగ్య, జీవిత బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు చట్ట ప్రకారం వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను పూర్తిస్థాయిలో మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సుమారు 17 వేల మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రావు పద్మ కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యోగుల తరపున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కొడిశెల గ్రామంలో మూడు సీసీ రోడ్ల పనులు ప్రారంభం

- **వర్షం పడితే చిత్తడిగా మారే రహదారులకు మహర్దశ**
- **మంత్రి సీతక్క చొరవతో నిధుల మంజూరు.. సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్**



ములుగు జిల్లా / తాడ్వాయి, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి):మండల పరిధిలోని లింగాల గ్రామపంచాయతీకి చెందిన కొడిశెల గ్రామంలో మూడు సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. లింగాల గ్రామపంచాయతీ సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ శనివారం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అభివృద్ధికి దూరంగా ఉన్న కొడిశెల గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. వర్షం పడితే రహదారులు బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని నిధులు మంజూరు చేయడంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చొరవ చూపారని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ఆమె సహకారాన్ని ఎప్పటికీ మరచిపోరని పేర్కొన్నారు. మూడు రోడ్ల నిర్మాణంతోనే అభివృద్ధి ఆగిపోదని, గ్రామంలోని ప్రతి రహదారిని సీసీ రోడ్డుగా మార్చేందుకు తనవంతు కృషి చేస్తానని రవీందర్ హామీ ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానని, గ్రామాభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని భరోసా కల్పించారు. గ్రామస్థులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించగల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పరిష్కారం కాని సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ఇంజినీర్ రాము, వార్డు సభ్యులు మంకిడి జగన్, మంత్రి నాగేశ్వరరావు, పీసా మొబైల్ ఈక రవీందర్, గ్రామస్థులు చేలా సారయ్య, కొట్టం లాలయ్య, చేలా ఎర్రయ్య, యాప సతీష్, మొగిలిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ నేత జేఎస్ఆర్



హనుమకొండ జిల్లా / ఎల్కతుర్తి, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఎల్కతుర్తి మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీ దుర్గాదేవి అమ్మవారిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపు రెడ్డి సురేందర్ రెడ్డి (జేఎస్ఆర్) దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని, గ్రామాల్లో సిరిసంపదలు వెల్లివిరియాలని, ప్రజలందరికీ మంచి జరగాలని ప్రార్థించారు. ప్రజల సంక్షేమం, సంతోషం కోసం అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఎల్కతుర్తి యువజన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బెస్తం చెరువు వద్ద సద్దుల బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన

- **మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి**
- **ఆదివారం మధ్యాహ్నంలోగా పనులు పూర్తి చేయాలి : జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న**



వరంగల్, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని బెస్తంచెరువు వద్ద చేపడుతున్న ఏర్పాట్లను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి 42వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ పరిశీలించారు. పండుగకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్పొరేషన్ తరపున అన్ని ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా కమిషనర్‌ను కోరారు. బెస్తంచెరువు వద్ద బతుకమ్మ ఆడేందుకు వచ్చే మహిళలకు పూర్తిస్థాయిలో విద్యుత్ దీపాలు, ధ్వని వ్యవస్థ ఏర్పాటు చేయాలని గుండు చందన పూర్ణచందర్ సూచించారు. చెరువులో ప్రమాదవశాత్తు ఎవరూ పడిపోకుండా రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో తాత్కాలిక కంచెతో పాటు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ, బెస్తంచెరువు వద్ద జరుగుతున్న పనులను ఆదివారం మధ్యాహ్నంలోగా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీర్ సంజయ్, వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాజేష్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ సురేష్, విద్యుత్ విభాగం ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ సంతోష్, సహాయ ఇంజినీర్లు వరుణ్, గఫూర్, పారిశుద్ధ్య తనిఖీ అధికారి భీమయ్య, పనుల తనిఖీ అధికారి వేణు, కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహారాములు, మున్సిపల్ సిబ్బంది ప్రశాంత్, శ్రీధర్, కృష్ణ, ప్రణీత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా గాదెపాక కిరణ్



జనగామ జిల్లా / పాలకుర్తి, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి):పాలకుర్తి మండల ఉప సర్పంచ్‌ల ఫోరం నూతన కార్యవర్గాన్ని శనివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ఎన్నికల్లో పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాదెపాక కిరణ్ ఫోరం అధ్యక్షుడిగా, లకావత్ నాగరాజు నాయక్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మండలంలోని ఉప సర్పంచ్‌లందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామపంచాయతీల బలోపేతం కోసం సమన్వయంతో పనిచేయాలనే లక్ష్యంతో ఫోరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ఉప సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, గ్రామాల అభివృద్ధికి అవసరమైన చర్యల కోసం సమష్టిగా కృషి చేయడం, ఉప సర్పంచ్‌ల హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించడం వంటి అంశాలకు ఫోరం ప్రాధాన్యమివ్వనుంది. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గాదెపాక కిరణ్, ప్రధాన కార్యదర్శి లకావత్ నాగరాజు నాయక్ మాట్లాడుతూ మండలంలోని ఉప సర్పంచ్‌లందరినీ కలుపుకొని గ్రామాల అభివృద్ధికి ఐకమత్యంతో కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఫోరం గౌరవ అధ్యక్షులుగా జంపాల పుష్పలీల, అంజయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బేజాడి సురేష్, ఉపాధ్యక్షులుగా పూజారి సురేష్, గోనె మహేందర్, కోశాధికారిగా కత్తుల ఎల్లయ్య, ప్రచార కార్యదర్శిగా మారేపల్లి జిక్షపతి, సంయుక్త కార్యదర్శులుగా పడిసే అశోక్, గుగులోత్ కమలమ్మ, వాసు నాయక్ ఎన్నికయ్యారు. ఫోరం సభ్యులుగా లకావత్ వెంకన్న నాయక్, భూక్య సురేష్ నాయక్, భూక్య సంగీత, నరేష్ నాయక్, బానోత్ వీరన్న నాయక్, లకావత్ బాలు నాయక్, దాసరి ఉప్పలయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

మృతుల కుటుంబాలను పరామర్శించిన
మంత్రి పొన్నం ప్రభాకర్

- **బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి.. అండగా ఉంటామని భరోసా**

హనుమకొండ జిల్లా / ఎల్కతుర్తి, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి)హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఎల్కతుర్తి మండలంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి, మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు.





కేశవపూర్‌లో సంజీవరెడ్డి కుటుంబానికి పరామర్శ

కేశవపూర్ గ్రామానికి చెందిన పీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి తండ్రి బొమ్మనపల్లి సంజీవరెడ్డి ఇటీవల మృతి చెందడంతో మంత్రి వారి నివాసానికి వెళ్లారు. సంజీవరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు.

ఎల్కతుర్తిలో పలువురి కుటుంబాలకు సంతాపం

ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం అనిల్ తల్లి శీలం సాంబలక్ష్మి ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.అలాగే ఇటీవల మృతి చెందిన శ్రీపతి సాధనంధం గౌడ్ తల్లి శ్రీపతి రాజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాస కొమురయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పోడు భూముల్లో కందకాల తవ్వకాలు నిలిపివేయాలి

- **ఆదివాసీల సాగు భూములపై అటవీ శాఖ చర్యలు ఆపాలి**

ఏటూరునాగారం, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి)గిరిజనులు గత 25 సంవత్సరాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న భూముల్లో అటవీ శాఖ అధికారులు పెద్దపెద్ద లోతైన కందకాలు తవ్వడాన్ని తక్షణమే నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివాసీల జీవనాధారమైన పోడు భూముల్లో ఇటువంటి చర్యల వల్ల వారి జీవనోపాధికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. దావూద్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూముల్లో కందకాలు తవ్వడం వల్ల వారి వ్యవసాయానికి ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. గిరిజనుల జీవనాధారమైన భూముల విషయంలో అటవీ శాఖ అధికారులు ఇలాంటి చర్యలు చేపట్టడం సరికాదన్నారు.

'కొత్త పోడు కొట్టేది లేదు.. పాత పోడు వదిలేది లేదు'

ఈ నినాదంతో ఆదివాసీలు తమ భూముల హక్కుల కోసం పోరాడుతున్నారని కృష్ణారెడ్డి తెలిపారు. గతంలో పోడు భూములకు పట్టాలు అందించేందుకు సర్వే కూడా నిర్వహించారని గుర్తుచేశారు. ఒకవైపు పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతుంటే, మరోవైపు అదే భూముల్లో కందకాలు తవ్వడంపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పోడు భూముల సమస్యను పరిష్కరించాలని, అర్హులైన ఆదివాసీలకు హక్కు పత్రాలు అందించాలని డిమాండ్ చేశారు.



అటవీ శాఖ అధికారులు పోడు భూముల విషయంలో చేపడుతున్న చర్యలను నిలిపివేసి, గిరిజనుల హక్కులను గౌరవించాలని కోరారు. కందకాల తవ్వకాలు ఆపకపోతే మరోసారి పోడు భూముల పోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం సీపీఎం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జిరెడ్డి సాంబశివ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి. వెంకటరెడ్డి, రాజేందర్, తోలం కృష్ణయ్య, ప్రభాకర్, నగేష్, చిరంజీవి, లాజర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట నూతన ఎస్సైగా భోగం ప్రవీణ్ బాధ్యతల స్వీకరణ

- **ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో మర్యాదపూర్వక భేటీ**
- **శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి**

వర్ధన్నపేట, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి):వర్ధన్నపేట మండల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా భోగం ప్రవీణ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడం నూతన ఎస్సై ముందున్న ప్రధాన బాధ్యతలుగా ఉన్నాయి. పోలీసు శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడంతోపాటు బాధితుల ఫిర్యాదులపై సత్వర స్పందన, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసినప్పుడే పోలీసు శాఖపై విశ్వాసం మరింత పెరుగుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నూతన ఎస్సై భోగం ప్రవీణ్ నేతృత్వంలో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని ఆశిస్తున్నారు.



కార్మికుల పట్ల ఏఐటీయూసీకి చిత్తశుద్ధి లేదు

- **కాంగ్రెస్ విధానాలతోనే సింగరేణికి నష్టం: టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి**
- **కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధిపై దృష్టి సారించాలి**



పెద్దపల్లి జిల్లా / గోదావరిఖని, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి)సింగరేణి బొగ్గు పరిశ్రమ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఇబ్బందులకు, గని కార్మికులకు అన్యాయం జరగడానికి, సంస్థలో కార్మికుల సంఖ్య తగ్గడానికి కాంగ్రెస్ విధానాలే కారణమని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు. శనివారం గోదావరిఖనిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి పరిశ్రమ గణనీయంగా అభివృద్ధి చెందిందని, టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా కొనసాగిన 11 ఏళ్లలో గని కార్మికులకు అనేక ప్రయోజనాలు చేకూరాయని పేర్కొన్నారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల అంశాన్ని తాకట్టు పెట్టింది ఏఐటీయూసీయేనని రాజిరెడ్డి విమర్శించారు. తిరిగి కారుణ్య నియామకాల ద్వారా వారసులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌లకే దక్కుతుందని అన్నారు. కార్మికుల సంక్షేమం పట్ల ఏఐటీయూసీకి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. టీబీజీకేఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు మాదాసి రామ్మూర్తి మాట్లాడుతూ సింగరేణి బొగ్గు పరిశ్రమ అభివృద్ధిపై కాంగ్రెస్‌కు బాధ్యత లేదని విమర్శించారు. సంస్థను అభివృద్ధి చేయడంలో విఫలమైన కాంగ్రెస్ నాయకులు, సింగరేణిపై కేటీఆర్ ప్రస్తావిస్తున్న అంశాలను జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. రామగుండం ప్రాంతంలో సింగరేణి క్వార్టర్లను కూల్చివేసి షాపింగ్ సముదాయాలు ఎలా నిర్మిస్తున్నారని రామ్మూర్తి ప్రశ్నించారు. కూల్చివేతలనే అభివృద్ధిగా భావించే కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి ఎలా కనిపిస్తుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో సింగరేణి సంస్థ నుంచి ఎంతమంది ఉద్యోగులను విధుల నుంచి తొలగించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. కొత్త గనులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. అనవసర ఆరోపణలు, విమర్శలను పక్కనపెట్టి కార్మికుల సంక్షేమం, సింగరేణి సంస్థ అభివృద్ధిపై కాంగ్రెస్ దృష్టి సారించాలని రామ్మూర్తి కోరారు. ఈ సమావేశంలో నాయకులు నూనె కొమురయ్య, చిలుపూరు సతీష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ప్రజా ప్రభుత్వమే కొండంత అండ!

- **కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**
- **రైతులు ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

వరంగల్ జిల్లా / వర్ధన్నపేట, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి):పేద కుటుంబాల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, రైతుల అభివృద్ధి, పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యతలని తెలిపారు.

ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. పంటల సాగులో తగిన జాగ్రత్తలు పాటించి నష్టాలను తగ్గించుకునేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ప్రతిపక్షాల ప్రచారంపై వాస్తవాలు తెలుసుకోవాలి

ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాల విషయంలో ప్రజలు వాస్తవాలను తెలుసుకోవాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు.





మహాలక్ష్మి అవతారంలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

అనంతరం వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న దుర్గామాతను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా గాదెపాక కిరణ్

జనగామ జిల్లా / పాలకుర్తి, అక్టోబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి):పాలకుర్తి మండల ఉప సర్పంచ్‌ల ఫోరం నూతన కార్యవర్గాన్ని శనివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ఎన్నికల్లో పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాదెపాక కిరణ్ ఫోరం అధ్యక్షుడిగా, లకావత్ నాగరాజు నాయక్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మండలంలోని ఉప సర్పంచ్‌లందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామపంచాయతీల బలోపేతం కోసం సమన్వయంతో పనిచేయాలనే లక్ష్యంతో ఫోరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ఉప సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, గ్రామాల అభివృద్ధికి అవసరమైన చర్యల కోసం సమష్టిగా కృషి చేయడం, ఉప సర్పంచ్‌ల హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించడం వంటి అంశాలకు ఫోరం ప్రాధాన్యమివ్వనుంది. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గాదెపాక కిరణ్, ప్రధాన కార్యదర్శి లకావత్ నాగరాజు నాయక్ మాట్లాడుతూ మండలంలోని ఉప సర్పంచ్‌లందరినీ కలుపుకొని గ్రామాల అభివృద్ధికి ఐకమత్యంతో కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమష్టిగా పని చేస్తామని పేర్కొన్నారు. ఫోరం గౌరవ అధ్యక్షులుగా జంపాల పుష్పలీల, అంజయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బేజాడి సురేష్, ఉపాధ్యక్షులుగా పూజారి సురేష్, గోనె మహేందర్, కోశాధికారిగా కత్తుల ఎల్లయ్య, ప్రచార కార్యదర్శిగా మారేపల్లి భిక్షపతి, సంయుక్త కార్యదర్శులుగా పడిసే అశోక్, గుగులోత్ కమలమ్మ, వాసు నాయక్ ఎన్నికయ్యారు. ఫోరం సభ్యులుగా లకావత్ వెంకన్న నాయక్, భూక్య సురేష్ నాయక్, భూక్య సంగీత, నరేష్ నాయక్, బానోత్ వీరన్న నాయక్, లకావత్ బాలు నాయక్, దాసరి ఉప్పలయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com